క్లుప్తంగా

పారా లీగల్ వలంటీర్‌గా మీసాల మధుబాబు



జడ్జి శ్రీవాణి చేతులమీదుగా ఐడీ కార్డు అందుకుంటున్న మధుబాబు

మఠంపల్లి : హుజూర్‌నగర్ కోర్టు పరిధిలో పారా లీగల్ వలంటీర్‌గా మఠంపల్లికి చెందిన సామాజిక కార్యకర్త మీసాల మధుబాబు నియమితులయ్యారు. గురువారం సూర్యాపేటలో జడ్జి శ్రీవాణి చేతులమీదుగా మధుబాబు ఐడీ కార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయస్థానంలో పరిధిలోని ప్రజలకు లోక్‌అదాలత్‌తో పాటు తదితర విషయాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త మాదాసు సైదయ్య ఐదు నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మంజూరైన రూ.రెండు లక్షల బీమా చెక్కును గురువారం గ్రామంలో మృతుడి భార్య జానమ్మకు ఆ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్రా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. సైదయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నూకమళ్ల రామకృష్ణ, నర్రా ఇంద్రశేఖర్‌రెడ్డి, దాసరాజు లక్ష్మయ్య, చెనగాని నర్సయ్య, ఉపేందర్‌రెడ్డి, తుమ్మల నాగయ్య, గోసుల లక్ష్మయ్య పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాలు కల్పించాలని వినతి



ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ వార్డు సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ, మాచవరం గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీ పథకంలో ఏడాదికి 100 రోజుల పనిదినాలు కల్పించాలని మాజీ వార్డు సభ్యులు కందుకూరి నరసింహ, జొన్నలగడ్డ నాగరాజు, మేరిగ మట్టపల్లి కోరారు. ఈమేరకు గురువారం స్థానికంగా ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌కు వారు వినతిపత్రం అందజేశారు. పనులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎంపీపీ వారికి హామీ ఇచ్చారు.

అనాథాశ్రమంలో అన్నదానం

నడిగూడెం : కోదాడ పట్టణంలో శనగల రాధాకృష్ణ స్వచ్ఛంద సంస్థకు చెందిన అనాథాశ్రమంలోని అనాథలకు నడిగూడెంకు చెందిన అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మన్నెం నిరంజన్‌రెడ్డి తల్లిదండ్రులు వీరారెడ్డి, చంద్రమ్మ జ్ఞాపకార్థం గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నదాతను ఆ సంస్థ నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పందిటి వంశీ, మొలుగూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టీఆర్ జయంతి ఉత్సవాలు



పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నేరేడుచర్ల : దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతి ఉత్సవాలను గురువారం నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి ఇంజమూరి వెంకటయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు యడవల్లి వెంకటకృష్ణ, ఇంజమూరి గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అర్వపల్లి : తిమ్మాపురం, అడివెంల గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను గురువారం ఏపీఓ చిలుక ఉపేందర్ పరిశీలించారు. కూలీల హాజరు నమోదు శాతం తెలుసుకొని వారితో మాట్లాడారు. వంద రోజుల పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. రోజుకు రూ. 300 వేతనం వచ్చేలా పనులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు లింగయ్య, గంగ, కూలీలు, మేట్లు పాల్గొన్నారు.

రైతుల పేరుతో మట్టి తవ్వకాలు

- రియల్ వ్యాపారులు, ఇటుక బట్టీలకు అమ్ముకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణం, మండల పరిధిలో మట్టి దందా జోరుగా సాగుతోంది. వర్షాభావ పరిస్థితులతో చెరువులన్నీ దాదాపుగా ఎండిపోవడంతో మట్టి వ్యాపారులు అక్రమంగా మట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. కోదాడ పట్టణంతో పాటు తమ్మర, దోరకుంట, గుడిబండ, తొగర్రాయి, రెడ్లకుంట, ఎర్రవరం చెరువుల్లో రైతుల పొలాలకు మట్టిని తరలిస్తున్నామని చెబుతూ వ్యాపారులు ఇష్టారాజ్యంగా చెరువుల్లోని మట్టిని తవ్వుతున్నారు. అయినప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంల లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రైతుల పేరు చెప్పి..

కాగా, చెరువుల్లోని నల్లమట్టిని రైతులు ఇటీవల కొన్నిరోజులు వారి పొలాలకు తోలుకున్నారు. మరికొందరు ఎలాంటి మట్టి ఉన్న నీరు నిలిచే పొలాల్లో పోసుకున్నారు. ఇదంతా ఆయా గ్రామాల్లో వారం, పదిరోజులు మాత్రమే జరిగింది. ఆ తర్వాత మట్టి మాఫియా రెచ్చిపోయి చెరువులను నామరూపాలు లేకుండా తవ్వుతున్నారు. రైతుల పేరు చెబుతూ చెరువుల్లో మట్టిని తోడుతున్నారు. కొందరు రియల్ వ్యాపారులకు అమ్ముకుంటుండగా మరికొందరు ఇటుక బట్టీలకు, కోదాడ పట్టణంలోని ప్లాట్లకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



తమ్మర చెరువులో మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్న వ్యాపారులు

శిఖం భూమి ఆక్రమణ..

మట్టి వ్యాపారులు చెరువుల్లో ఇష్టానుసారంగా గుంతలు పెడుతున్నారు. రియల్ వ్యాపారులకు, ఇటుక బట్టీల నిర్వాహకులకు కావాల్సిన మట్టి ఎక్కడ ఉందో చూసి అక్కడే జేసీబీలతో గుంతలు తవ్వుతున్నారు. దీంతో చెరువులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. వర్షాకాలంలో నీరు చేరాక లోతైన గుంతల్లో దిగి ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. గతంలో చిన్నారులు చెరువుల్లోని గుంతల్లో పడి మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇక లోతైన గుంతలతో మత్స్యకారులు సైతం చేపలు పట్టేందుకు వీలు లేకుండా పోతుంది. మరికొన్ని చోట్ల చెరువులోని మట్టిని తవ్వి ఆ మట్టితోనే అక్కడి శిఖం భూమిని ఆక్రమించేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. కోదాడ పట్టణంలోని రామిరెడ్డిపాలెం రోడ్డులో ఓ వ్యక్తి పెద్దచెరువులోని మట్టిని తవ్వి దాదాపుగా రెండెకరాల విస్తీర్ణం గల శిఖంలో మట్టిని పోసి ఆక్రమించుకున్నాడు.

చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వితే చర్యలు



కోదాడ మండలంలోని చెరువుల్లో మట్టిని తవ్వుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. రైతులు వ్యవసాయ భూములకు తోలుకుంటున్నారని ఇరిగేషన్ అధికారులు మాకు తెలిపారు. రైతులకు కాకుండా ఇతర వ్యాపార అవసరాలకు అక్రమంగా మట్టిని తవ్వి అమ్ముకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– సాయాగౌడ్, తహసీల్దార్, కోదాడ

11,12 తేదీల్లో రాజకీయ శిక్షణ తరగతులు

హుజూర్‌నగర్ : మండలంలోని శ్రీనివాసపురంలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించబోయే సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుర్గి బ్రహ్మం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. గురువారం హుజూర్‌గనగర్‌లోని అమరవీరుల స్మారక భవనంలో వారు శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. హుజూర్‌నగర్ పట్టణం, మండలం, మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి మండలాల పార్టీ సభ్యులకు మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా రాజకీయాలు వేగంగా మారుతున్న ఈ తరుణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను చైతన్యం చేయడం కోసం ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరమల్లు, పి.వెంకటనారాయణ, టి.వీరయ్య, ఆర్.వీరస్వామి, సీహెచ్.పర్వతాలు, పి.వీరబాబు, ఎస్.వెంకన్న, జి.శ్రీను, వై.సోమయ్య, ఐ.తిరపయ్య, వి.గోవిందు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడరూరల్ : వేసవి కాలంలో ఏర్పాటు చేస్తున్న క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపారి షేక్.ఆదాం అన్నారు. కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వాలీబాల్ శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు గురువారం వాలీ బాల్స్‌ను ఆయన అందజేసి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వారికి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇప్పించి ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో కోచ్ జూలూరు వీరభద్రం, చెరకు అశోక్, మంద శ్రీనివాసరావు, రంగిశెట్టి రంగా, ఈదుల కృష్ణయ్య, అలెక్స్, భాస్కర్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు ఉన్నారు.



వాలీబాల్స్ అందజేస్తున్న ఆదాం, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పిల్లలమర్రి ఆలయంలో ప్రత్యేక పూజలు

సూర్యాపేట : మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీఎరకేశ్వర స్వామి ఆలయంలో శనీశ్వర జయంతి సందర్భంగా ఆలయ అర్చకుడు కోట్ల నందీశ్వర శర్మ గురువారం శని దేవునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పిల్లలమర్రి శివాలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. శని విగ్రహానికి తైలాభిషేకం నిర్వహించి ప్రదక్షిణలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ సహాయ పూజారి, కమిటీ చైర్మన్ కోట్ల సైదులు, గడ్డం వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.



పిల్లలమర్రిలో పూజలు చేస్తున్న భక్తులు

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీలో చేరిక



మాస్‌లైన్ పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న నాయకులు

భానుపురి : చివ్వెంల మండలం మోహిదీపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుకలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కారింగుల వెంకన్న మాట్లాడారు. మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా సూర్యాపేట పట్టణంలో పేదల పక్షాన ప్రజా ఉద్యమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ ఉద్యమాలకు ఆకర్షితులై అనేకమంది స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఎస్‌కె.వాజిద్, పార్టీ డివిజన్ నాయకులు పిడమర్తి లింగన్న తదితరులు పాల్గొన్నారు.

బస్సెక్కండి.. బహుమతి పొందండి

- ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్

మిర్యాలగూడ టౌన్ : ప్రతిఒక్కరూ సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు ఎక్కి బహుమతి పొందాలని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం జీవీ మాల్ సౌజన్యంతో 'ఆర్టీసీ బస్సెక్కండి– బహుమతి పొందండి'అనే కార్యక్రమంలో భాగంగా డ్రా తీశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నుంచి విజయవాడకు వెళ్లే రూట్లలో డీలక్స్ సర్వీసులకు ఆదాయం పెంపు, టార్గెట్ సాధించేందుకు గాను మహిళలను ఆకట్టుకునే విధంగా ఈ కార్యక్రమాన్ని జీవీ మాల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ స్కీమ్‌ను ప్రారంభించినప్పటి నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ఈ డ్రాలో ప్రథమ బహుమతి చిలుకూరు మండల బేతవోలు గ్రామానికి చెందిన భద్రమ్మ, ద్వితీయ బహుమతి నందిగామకు చెందిన పోలి శారద, తృతీయ బహుమతి దామరచర్ల మండల కేంద్రానికి చెందిన లాస్యలు గెలుచుకున్నారన్నారు. ఆర్టీసీ సంస్థకు అన్ని విధాలుగా సహకరిస్తున్న ప్రయాణికులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ భారతీబాయి, ఎంఎఫ్ పుష్పాల యాదగిరి, జీవీ మాల్ ప్రతినిధులు హరి, సంపత్, సాయి, ఆర్టీసీ సిబ్బంది ఎక్బాల్, పరంగి నాగేశ్వర్‌రావు, జనార్దన్ ఉన్నారు.



ప్రయాణికురాలికి బహుమతి అందజేస్తున్న డీఎం

ఘనంగా బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం



బోనాలతో వెళ్తున్న మహిళలు

అర్వపల్లి : మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ తృతీయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత జలబిందెలతో బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ఆ తర్వాత బోనాల ఊరేగింపు నిర్వహించారు. అలాగే బొడ్రాయికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల నర్సయ్య, గౌరమ్మ, తాండారపల్లి శ్రీనివాస్, బీబమ్మ, లింగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ అర్బన్ : పెండింగ్‌లో ఉన్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతమ్‌రెడ్డి కోరారు. గురువారం మిర్యాలగూడలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతినెలా రెండో తేదీనే పారితోషికం ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేనియెడల ఆశా వర్కర్లతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంటు రామారావు, ఆశ వర్కర్లు పద్మ, కవిత రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

పేదల పక్షాన సీపీఎం పోరాటం

మేళ్లచెరువు : పేదల పక్షాన సీపీఎం నిరంతర పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి వట్టెపు సైదులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 11, 12 తేదీల్లో హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురం గ్రామంలో పార్టీ గ్రామ శాఖ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండు సైదులు, మరియమ్మ, బి.సైదులు, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన స్కూల్ యూనిఫాం



ఎమ్మార్సీలో యూనిఫాం అందజేస్తున్న సిబ్బంది

అర్వపల్లి : పాఠశాలలు పునః ప్రారంభం కాగానే పిల్లలకు కొత్త యూనిఫాం అందించాలనే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జాజిరెడ్డిగూడెం మండలంలో యూనిఫాం కుట్టు పనులు పూర్తయ్యాయి. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలలో మొత్తం 1,791మంది విద్యార్థులుండగా వీరందరికి ఒక్కో జత చొప్పున యూనిఫాం అందించనున్నారు. ఈ యూనిఫాంలను సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు కుట్టారు. కుట్టిన యూనిఫాంలను ఎమ్మార్సీకి చేర్చారు. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం కాగానే కొత్త దుస్తులను అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ బి.బాలునాయక్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి చత్రునాయక్, మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం నేరేడుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం బట్టు మధు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ ఇంజమూరి శ్రావణి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ చిలకరాజు శ్రీను, రిటైర్డు ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రారెడ్డి, మెప్మా ఆర్పీలు ఉష, సరిత, నాగలక్ష్మి, కృష్ణకుమారి, రోజా, నాగమణి, కళ్యాణి, ఉపాధ్యాయులు పద్మావతి, రషీద, సైదులు, వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, ప్రభాకర్‌రెడ్డి, మాధవి, నర్సింహారావు, భవాని, కళ్యాణి, శ్రవంతి, కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, నగేష్, పద్మ, లాల్‌సాహెబ్, విజయలక్ష్మి, సరస్వతి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



నేరేడుచర్లలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ చత్రునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

'బడిబాట'ను విజయవంతం చేయాలి

గరిడేపల్లి : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ చత్రునాయక్ కోరారు. గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేలా ఉపాధ్యాయులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమం ప్రారంభం

నడిగూడెం : మండల వ్యాప్తంగా గురువారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనపనేని రామారావు, ఎం.వెంకటాచారి, ముజ్బూర్ రెహ్మాన్, జి.సైదులు, సీఆర్పీలు నందిగామ రామారావు, రాజుల గురుస్వామి, నాగార్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నడిగూడెం : తెల్లబల్లిలో..



గరిడేపల్లిలో..

ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నదానం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గురువారం ఆ క్లబ్‌ల డిస్ట్రిక్ పీఆర్‌ఓ రాయపూడి భవాని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సేవ చేయడంలో ఎంతో తృప్తి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ వీరవెల్లి పద్మావతి, జోన్ చైర్ పర్సన్ రమాదేవి, డిస్ట్రిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తిరునగరు పద్మావతి, భువనగిరి లావణ్య, కొండూరు ఇందిరా, గుండా లక్ష్మి, వీరవెల్లి శ్రీదేవి, జైయిని సుష్మిత, జైనీ పద్మావతి, ఓరుగంటి జ్యోతి, మంచుకంటి శ్రీదేవి, రేపాల శ్రీనివాస్, జనార్దన్, మారం పద్మశ్రీనివాస్, శివ నాగజ్యోతి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని పూర్తి స్థాయిలో అరికట్టాలని తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ కోరారు. గురువారం మిర్యాలగూడలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. పట్టణంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు ఎల్‌కేజీ విద్యార్థికి 45 వేల నుంచి 70 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎర్రబెల్లి గంగాధర్, కోటేష్, లోకేష్, నవీన్, రాం మోహన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

ప్రతీ ఏడాది.. ప్రతిభ కనబరిచి

- ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్‌దే హవా
- ఈ ఏడాది 10 మంది విద్యార్థుల ఎంపిక
- పదేళ్లలో 80 మందికి పైగానే..
- ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఉత్తమ ఫలితాలు

చిలుకూరు : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఫలితాల్లో ప్రతి ఏడాది చిలుకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనానికి ఎంపిక అవుతున్నారు. ఈ ఏడాది ఈ పాఠశాల నుంచి జిల్లాలోనే ఎక్కువ మంది విద్యార్థులు ఎంపికై ప్రశంసలు అందుకున్నారు. కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు చేయూత ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించి స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని ప్రతి ఏడాది పోటీ పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రకారం స్కాలర్‌షిప్ అందజేస్తోంది. దీంతో ప్రతి ఏడాది చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపిక అవుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో ఈ పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ప్రథమ ర్యాంక్ సాధించి ఎంపిక అయ్యారు. కాగా ఎంపికైన విద్యార్థులకు ప్రతి ఏడాది రూ.12వేల చొప్పున వరుసగా నాలుగు సంవత్సరాల పాటు (9వ తరగతి నుంచి ఇంటర్ వరకు) మొత్తం రూ.48 వేల స్కాలర్‌షిప్ అందుతుంది.



చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..

ఎన్‌ఎంఎంఎస్ పోటీ పరీక్షలో ఈ ఏడాది చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి సలహాలతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు సైన్స్ ఉపాధ్యాయుడు కె.రామారావు ఇచ్చే కోచింగ్‌తో విద్యార్థులు రాణించి స్కాలర్‌షిప్‌ను సాధిస్తున్నారు. ప్రధానంగా సైన్స్ టీచర్ రామారావు ఆదివారాల్లో సైతం కోచింగ్ ఇచ్చి విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో రాణించి ఎంపిక అయ్యేలా తీర్చిదిద్దుతున్నారు. ప్రధానోపాధ్యాయులు, సైన్స్ టీచర్, పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం అందించడంతో ప్రతి ఏడాది స్కాలర్‌షిప్‌లు సాధిస్తున్నామని విద్యార్థులు అంటున్నారు. ఎన్‌ఎంఎంఎస్‌కు 2010 నుంచి ఈ ఏడాది వరకు చిలుకూరు జెడ్పీ పాఠశాల నుంచి మొత్తం 80 మందికి పైగానే విద్యార్థులు ఎంపికై పాఠశాల పేరును నిలబెట్టారు.

సెలవు రోజుల్లోనూ కోచింగ్ ఇచ్చా



ప్రతిరోజూ కోచింగ్ ఇవ్వడంతో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారు. సెలవు రోజుల్లోనూ తమ వ్యక్తిగత పనులు మానుకొని విద్యార్థులకు కోచింగ్ ఇచ్చి ప్రతిరోజు టెస్టులు నిర్వహించడంతో ర్యాంక్‌లు సాధించారు. ఈ ఏడాది 10 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– కె. రామారావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్ చిలుకూరు

ప్రతి ఏడాది ఎంపిక అవుతున్నారు



చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇప్పటివరకు 80 మంది పైగా విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లు సాధించారు. ఈ ఏడాది జిల్లాలో అత్యధికంగా మా పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. సైన్స్ ఉపాధ్యాయుడు రామారావు కోచింగ్‌తో విద్యార్థులు ఈ ఏడాది కూడా విజయం సాధించారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుల పోత్సాహం కూడా చాలా ఉంది.

– కరుణాకర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ చిలుకూరు